చరిత్రకు ఆనవాళ్లుగా సినిమా టాకీసులు

- టీవీలు, ఓటీటీల రాకతో ప్రేక్షక ఆదరణ కరువు
- క్రమంగా కనుమరుగైన తెరలు



మూతపడిన సీతారామపురంలోని విజయలక్ష్మి టాకీస్

సీతారామపురం : ప్రజల వినోదం కొత్త పుంతలు తొక్కుతున్న తరుణంలో ఒకప్పుడు ఎంతో వైభోగం అనుభవించిన రంగాలు మారుతున్న కాలంలో నిస్తేజంగా మారుతున్నాయి. అందుకు ప్రత్యక్ష ఉదాహరణగా సినిమా హాళ్లను చెప్పుకోవచ్చు. రంగస్థల నాటకాలు రాజ్యమేలిన కాలం ఒకటుండేది. అప్పట్లో పౌరాణిక నాటకాలకు ప్రజల నుంచి విశేష ఆదరణ లభించేది. నాటకాలకు సైతం టికెట్ కొనుక్కుని చూసిన రోజులు ఉన్నాయంటే ఈ తరానికి ఎంతో ఆశ్చర్యంగా ఉంటుంది. ప్రస్తుతం నాటకాలను ప్రదర్శిస్తే చూసేందుకు ప్రేక్షకులు రాని పరిస్థితి. అనంతరం సినిమాలు రావడంతో ప్రేక్షకుల ప్రాధాన్యంలో మార్పు సంతరించుకుంది. తెరపై తమ అభిమాన తారలు ఆడిపాడుతుంటే వింతగా చూసి అబ్బురబడిన సందర్భాలు ఉన్నాయి. అలా సినిమాలు దాదాపు మూడు దశాబ్దాల పాటు వినోద రంగంలో ఏకఛత్రాధిపత్యం వహించాయి. కొత్త సినిమా రిలీజ్ అయిందంటే థియేటర్ల వద్ద పండుగ వాతావరణం కనిపించేది. ఒక్కొక్క సినిమా వంద రోజుల నుంచి ఏడాది పాటు ఆడిన సందర్భాలు ఉండేవి. పౌరాణికాలు, జానపదాలు, సాంఘికాలు, ఏ జోనర్‌లో సినిమా వచ్చిన ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ లభించేది. టీవీలు వచ్చే వరకు ఇదే పరిస్థితి కొనసాగింది. కొత్త సినిమాలు లేని సమయంలో పాత వాటినే మళ్లీ మళ్లీ సినిమా థియేటర్లలో ప్రదర్శించేవారు. ఎన్నిసార్లు చూసినా తిరిగి చూడటానికి ప్రేక్షకులు కూడా వచ్చేవారు. దీంతో థియేటర్ల రాజ్యం ఎంతో వైభవంగా కొనసాగింది.

ప్రేక్షకుల ఆదరణ కరవు

సాంకేతిక విప్లవం కారణంగా వినోదం నట్టింట్లోకి వచ్చేసింది. తొలుత టీవీలు ప్రజలను ఇళ్లకే పరిమితం చేయగా ఇప్పుడు ఓటీటీలు యువతను సైతం కట్టిపడేస్తున్నాయి. టీవీల రంగ ప్రవేశం కేబుళ్ల సాంకేతికత అందుబాటులోకి వచ్చిన తర్వాత పాత సినిమాలు అందులో ప్రదర్శితమవుతూ ఉండడంతో వాటిని థియేటర్లలో చూడడానికి వచ్చే ప్రేక్షకుల సంఖ్య తగ్గిపోయింది. అనంతరం సినిమాల కోసమే ప్రత్యేక చానళ్లు అందుబాటులోకి రావడంతో ప్రతినిత్యం ఏదోక పాత సినిమాను ఇంట్లోనే చూసే అవకాశం కలిగింది. దీంతో థియేటర్లకు వెళ్లే ప్రేక్షకుల సంఖ్య కాలక్రమేణా గణనీయంగా తగ్గిపోతూ వచ్చింది. తాజాగా ఓటీటీలు నట్టింట్లో సందడి చేయడం ప్రారంభించడంతో థియేటర్ల మనుగడే ప్రశ్నార్థకంగా మారింది. కొత్తగా రిలీజ్ అయిన పెద్ద హీరో సినిమా సైతం మూడు వారాలకే ఇంట్లో కూర్చుని చూసే సౌకర్యాన్ని ఓటీటీలు అందిస్తున్నాయి. ఒక ఫ్యామిలీ మొత్తం థియేటర్‌కు వెళితే ఒక్క సినిమాకే వేయి రూపాయలు ఖర్చవుతుంటే అదే ఖర్చుతో ఓటీటీలో ఏడాది పాటు పెద్ద హీరోలు, చిన్న హీరోలు అనే తేడా లేకుండా అందరి కొత్త సినిమాలు చూసే అవకాశం వచ్చింది. దీంతో పాటు ఇతర భాషల పెద్ద హీరోల చిత్రాలు కూడా తెలుగు అనువాదాలతో ఓటీటీలో అందుబాటులోకి వస్తున్నాయి. ఈ కారణంగా సగటు ప్రేక్షకుడు థియేటర్లకు వెళ్లడానికి దాదాపు తగ్గించేసుకున్నాడు. దీంతో పట్టణ ప్రాంతాల్లోని థియేటర్లు రూపు మార్చుకుని ప్రజలకు దర్శనమిస్తుండగా గ్రామీణ ప్రాంతాల్లో మాత్రం దిష్టిబొమ్మల్లా అలాగే మిగిలిపోయాయి.

సినిమా చూడందే నిద్ర పట్టేది కాదు



అప్పట్లో సినిమా చూడనిదే నిద్ర పట్టేది కాదు. థియేటర్లో ఆడే ప్రతి సినిమాను కనీసం రెండుసారులైనా చూసేవాళ్లం. స్నేహితులు బంధువులతో కలిసి సినిమా చూస్తుంటే ఆ మజానే వేరుగా ఉంటుంది. కొత్త సినిమా వచ్చిందంటే తొలిరోజే చూడాల్సిందే. ప్రస్తుతం థియేటర్లన్నీ కనుమరుగవడంతో టీవీలను ఆశ్రయిస్తున్నాం.

–సురేష్‌బాబు

రాత్రి ఆటకు వెళ్లే వాళ్లం



థియేటర్లలో సినిమాలను ప్రదర్శిస్తున్న రోజుల్లో రాత్రిపూట ఆటకు వెళ్లే వాళ్లం. 8 గంటలకల్లా భోజనాలు ముగించుకుని 9 గంటలకల్లా సినిమాహాల్ వద్దకు చేరి రాత్రి ఆట చూసి ఇళ్లకు వచ్చేవాళ్ల. అప్పట్లో టీవీలు లేకపోవడంతో ఇంటిల్లిపాది ప్రతి సినిమాను థియేటర్‌కు వెళ్లి చూసేవాళ్ళం. థియేటర్లలో సినిమా చూస్తే ఆ ఆనందమే వేరుగా ఉంటుంది. కాలక్రమేణా టీవీలు రావడంతో థియేటర్లు గ్రామీణ ప్రాంతాల్లో కనుమరుగయ్యాయి.

–వెంకటరత్నం

ప్రేక్షక ఆదరణ కరువవడంతోనే..



ప్రేక్షక ఆదరణ కరువడంతో సినిమాహాళ్లు నాటి వైభవాన్ని కోల్పోయాయి. 1976లో విజయలక్ష్మి టాకీస్ పేరుతో సినిమాహాలు నిర్మించా. మూడు దశాబ్దాల పాటు ప్రేక్షకులు సినిమాలను థియేటర్లలో చూసి ఆదరించారు. కాలక్రమేణా టీవీలు రావడంతో థియేటర్లు కనుమరుగయ్యాయి.

– వీసీ అల్లూరు రాజు, సీతారామపురం

క్లుప్తంగా

మద్యం దుకాణాల్లో తనిఖీలు



మర్రిపాడు: మండలంలోని మద్యం దుకాణాలను ఎక్సైజ్ అధికారులు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎక్సైజ్ ఎస్సై ఆంజనేయులు తన సిబ్బందితో కలిసి రికార్డులను తనిఖీ చేసి స్టాక్‌ను పరిశీలించారు. ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు మద్యం విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

పీహెచ్‌సీలో తాగునీటి సమస్య పరిష్కారం



సాక్షి ఎఫెక్ట్..

ఉదయగిరి: స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలోని తాగునీటి బోరు మోటార్ మరమ్మతులకు గురవడంతో పదిహేను రోజులుగా వైద్యశాలకు వచ్చే రోగులు, సిబ్బంది తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై ఈ నెల 23న 'సాక్షి'లో 'సీహెచ్‌సీలో తాగునీటికి అవస్థ' అనే శీర్షికతో కథనం ప్రచురితమవడంతో డీడీఓ ప్రశాంత్ స్పందించారు. తాగునీటి సమస్యను ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించి ఆయన సమస్యను పరిష్కరించాలని స్థానిక నాయకుడు తుమ్మల కిరణ్‌ను ఆదేశించారు. దీంతో ఆయన సోమవారం రూ.30 వేలు వెచ్చించి కొత్త మోటర్‌ను ఏర్పాటు చేసి వైద్యశాలలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించారు. దీంతో రోగులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

శైవక్షేత్రాల్లో విశేష పూజలు



సంగం: శ్రావణ మాసం తొలి సోమవారాన్ని పురస్కరించుకుని మండలంలోని శైవక్షేత్రాల్లో విశేష పూజలు నిర్వహించారు. సంగంలోని తిరుమనకొండపై ఉన్న రాజరాజేశ్వరీదేవి పీఠంలోని కాశీవిశ్వేశ్వరునికి వేకువజామున పెన్నానది జలాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వేదపండితుల వేదమంత్రోచ్ఛారణలతో మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. అలాగే త్రివేణి సంగమం ఒడ్డున ఉన్న సంగమేశ్వరుడు, వంగల్లు భీమేశ్వరుడు, దువ్వూరులోని కోటేశ్వరస్వామికి విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు.

డివైడర్‌ను ఢీకొన్న ఆటో

- ఇద్దరికి గాయాలు

సోమశిల: అనంతసాగరం తహసీల్దార్ కార్యాలయ సమీపంలో సోమవారం ఆటో అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటోలోని రాజాల రఘురాంకు స్వల్పగాయాలవగా, రాజాల పవన్‌కళ్యాణ్‌కు కాలు విరిగింది. స్థానికుల సమాచారంతో క్షతగాత్రులను 108 వాహన సిబ్బంది ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

విద్యార్థులకు యూనిఫామ్ పంపిణీ



కొండాపురం : మండలంలోని ఆదిమూర్తిపురం ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు యూనిఫామ్‌ను సోమవారం పంపిణీ చేశారు. పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ చిమ్మిలి శ్రీనివాసులు రూ.12వేలు నగదు వెచ్చించి విద్యార్థులకు యూనిఫామ్ కుట్టించి అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్‌ను విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు. హెచ్‌ఎం గుర్రం మాల్యాద్రి, అంగన్‌వాడీ కార్యకర్త మహేశ్వరి, రావూరి రత్నం, గ్రామస్తులు పాల్గొన్నారు

గ్రామసచివాలయ భవనం ప్రారంభం



అల్లూరు: మండలంలోని ఇందుపూరు, పురిణి గ్రామాల్లో ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర సోమవారం పర్యటించారు. ఇందుపూరులో గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం రూ.25 లక్షలతో నిర్మించిన సీసీరోడ్లను ప్రారంభించారు. నాయకులు బీద గిరిధర్, పలగాటి శ్రీనివాసుల రెడ్డి, హరికృష్ణ, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలను తొలగించాలని వినతి

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలో చెరువు ఎగువ ప్రాంతంతో పాటు కాలువలు, అలుగు పోరంబోకు స్థలాలను కొందరు ఆక్రమించి విక్రయాలు చేస్తున్నారని, ఆక్రమణలను తొలగించాలని వ్యవసాయ, రైతు సంఘం అధ్యక్షుడు ఎల్ కృష్ణ ప్రసాద్ కోరారు. ఈ మేరకు నెల్లూరులోని కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ ఆనంద్‌కు వినతి పత్రం అందజేశారు. సర్వే నంబర్లు 898, 899, 900లోని చెరువు అలుగు కాలువ పోరంబోకు ఆక్రమణపై లోకాయుక్తాకు సైతం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వాశిలి చెరువుకు సాగునీటిని అందించే వాగును ఇటీవల ఇష్టారాజ్యంగా తవ్వి దారి మళ్లించారని, ఇందుకోసం రూ.4.95 లక్షల ప్రభుత్వ నిధులు ఖర్చు చేశారని పేర్కొన్నారు. ఆక్రమణదారులకు ఇరిగేషన్ అధికారులు సహకరిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ ఉన్నతాధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఆక్రమణదారులపై తగిన చర్యలు చేపట్టాలని కోరారు.

భూముల పరిశీలన



కలిగిరి: మండలంలోని పెద్దకొండూరు పరిసర ప్రాంతాల్లో పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలమైన భూములను ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ శివప్రసాద్ సోమవారం పరిశీలించారు. ఇన్‌చార్జి తహసీల్దార్ ఎం గిరీష్‌ను అడిగి భూముల వివరాలను తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో భూములను పరిశీలించి రెవెన్యూ అధికారులకు పలు సూచనలు చేశారు. ఆర్‌ఐ లీలాసుజి, సర్వేయర్ సోని, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులపై లాఠీచార్జి అమానుషం



పోలీసుల తీరును ఖండిస్తూ నిరసన తెలుపుతున్న కార్మికులు

ఆత్మకూరు: నెల్లూరులో సోమవారం శాంతియుతంగా నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులను అడ్డుకుని మహిళలని కూడా చూడకుండా అమానుషంగా లాఠీచార్జి చేసిన పోలీసుల దమనకాండను ప్రతిఒక్కరూ ఖండించాలని ఆత్మకూరు సీఐటీయూ నాయకులు అన్నారు. పోలీసుల లాఠీచార్జిని ఖండిస్తూ ఆత్మకూరులో సీఐటీయూ జిల్లా కార్యదర్శి జీ శివప్రసాద్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ పారిశుధ్య పనులను కాంట్రాక్టర్లకు అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. అందులో భాగంగా పారిశుధ్య పనులు చేపడుతున్న వారిని అడ్డుకోగా, వేదాయపాళెం సీఐ కొంత మంది పోలీసులతో కలిసి హఠాత్తుగా మున్సిపల్ కార్మికులపై లాఠీచార్జి జరిపించారని ఆరోపించారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న మహిళలపై లాఠీచార్జికి పాల్పడిన సీఐ, పోలీసులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీలను ప్రైవేటీకరణ చేసే దిశగా పలు కార్మిక వ్యతిరేక చర్యలు చేపడుతుందని ఆరోపించారు. ప్రభుత్వ దమనకాండ ఇలాగే కొనసాగితే మున్సిపల్ కార్మిక ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సీఐటీయూ నాయకులు ఏ నాగయ్య, కొండమూరి హజరత్తయ్య, జీ నాగేంద్ర, గురవయ్య, చిన్నబాబు, సీపీఎం నాయకులు డేవిడ్‌రాజు, యూఈఈయూ కార్మిక నాయకులు ఏ మహేష్, తదితరులు పాల్గొన్నారు.

పాత రహదారిని పునరుద్ధరించాలని వినతి



ఆత్మకూరు: నెల్లూరు నుంచి వైఎస్సార్ కడప జిల్లాకు వెళ్లేందుకు బ్రిటీష్ కాలం నుంచి వాడుకలో ఉన్న పాత రహదారిని పట్టణ ప్రజలకు ఉపయోగపడేలా పునరుద్ధరించాలని సీపీఎం, సీఐటీయూ నాయకులు కోరారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ సీ గంగాప్రసాద్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. సీపీఎం కార్యదర్శి డేవిడ్‌రాజు, సీఐటీయూ నాయకుడు శివప్రసాద్ రోడ్డు పూర్వాపరాలను కమిషనర్‌కు వివరించారు. ఆత్మకూరు మండలంలో వాశిలి వద్ద ప్రవేశించే పాత రహదారి మున్సిపల్ పరిధిలోని బైపాస్‌రోడ్డు గురుకుల పాఠశాల, డంపింగ్ యార్డు, ప్రభుత్వ జిల్లా వైద్యశాల, నాగులపాడు రోడ్డు మీదుగా సాగుతుందని తెలిపారు. ఈ రహదారి ఆత్మకూరు మున్సిపల్ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు. పట్టణంలోకి రాకుండా బైపాస్ రోడ్డు మీదుగా ప్రయాణించే బస్సులు ఈ మార్గంలో వెళ్తే ప్రజలకు అందుబాటులో ఉంటాయన్నారు. మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ సందానీ, హజరత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సబ్సిడీపై వ్యవసాయ డ్రోన్లు



వ్యవసాయ డ్రోన్‌ను అందజేస్తున్న ఏఓ

అనుమసముద్రంపేట: ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై వ్యవసాయ డ్రోన్లను అందజేస్తోందని ఏఓ ఎం సురేష్‌బాబు తెలిపారు. మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో పందిపాడు వెంకటేశ్వర రైతు గ్రూపునకు చెందిన వీరాస్వామికి వ్యవసాయ డ్రోన్ సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ప్రభుత్వం ఐదుగురు రైతులు కలిగిన గ్రూపులకు వ్యవసాయ డ్రోన్లను సబ్సిడీపై అందజేస్తోందని తెలిపారు. డ్రోన్ విలువ రూ.9.80 లక్షలు కాగా రైతులు కేవలం రూ.2లక్షలు చెల్లిస్తే ప్రభుత్వం రూ.7.80 లక్షల సబ్సిడీని భరించి డ్రోన్‌ను ఇస్తుందన్నారు. వ్యవసాయ డ్రోన్‌లను వినియోగించి పంట పొలాలకు పురుగు మందులను అతితక్కువ సమయంలో పిచికారీ చేసుకోవచ్చని తెలిపారు. అంతేకాకుండా పక్కన పొలాలకు పిచికారీ చేయడం ద్వారా మంచి ఆదాయాన్ని పొందవచ్చనని వివరించారు. మండలంలోని రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉదయగిరి జిల్లా ఏర్పాటుకు సహకరించండి



కావలి ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డికి వినతి పత్రం ఇస్తున్న ఉద్యమ నాయకులు

ఉదయగిరి రూరల్: జిల్లాల పునర్విభజనకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించిన నేపథ్యంలో ఉదయగిరి జిల్లా ఏర్పాటుకు సహకారాన్ని అందించాలని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డిని ఉదయగిరి జిల్లా ఉద్యమ నేతలు కోరారు. సోమవారం కావలిలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డిని జిల్లా సాధన సమితి అధ్యక్షుడు డాక్టర్ కే వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఉద్యమ నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. నెల్లూరు, ప్రకాశం, వైఎస్సార్ జిల్లాల్లోని వెనుకబడిన 21 మెట్ట మండలాలను కలిపి ఉదయగిరి జిల్లాగా చేయాలని వారు కోరారు. దశాబ్దాలుగా ఎదురుచూసిన సోమశిల హైలెవెల్ కాలువ, వెలుగొండ ప్రాజెక్ట్ ద్వారా సాగుజలాలు అందలేదన్నారు. తాగు, సాగునీరు లేక మెట్టప్రాంత ప్రజలు దశాబ్దాలుగా ఇక్కట్లు పడుతున్నారని ఆయన దృష్టికి తెచ్చారు. విద్య, వైద్యం, రవాణా, తదితర సౌకర్యాలు లేక ఈ ప్రాంతప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెనుకబడిన ప్రాంతాన్ని జిల్లా చేయడం ద్వారా ఈ ప్రాంతం శీఘ్ర అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. జిల్లా ఉద్యమ నాయకులు మురళి, రషీద్, నాని, తదితరులు పాల్గొన్నారు.

డీసీపల్లిలో 323 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో సోమవారం 323 బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 636 బేళ్లు రాగా, 323 బేళ్లను విక్రయించామని చెప్పారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.280, కనిష్టంగా రూ.159, సగటున రూ.231.37 ధర లభించిందని వివరించారు. వేలంలో పది కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.

కిలో పొగాకు సగటు ధర రూ.209

కలిగిరి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో సోమవారం కిలో పొగాకుకు సగటు ధర రూ.209 లభించింది. జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 475 బేళ్లను తీసుకురాగా, 247 బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 228 బేళ్లను కొనుగోలుకు తిరస్కరించారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.280, కనిష్టంగా రూ.160, సగటున రూ.209.63 ధర పలికిందని వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు.

ప్రభుత్వ హెచ్చరిక బోర్డు తొలగింపుపై ఫిర్యాదు

కొండాపురం : మండలంలోని గానుగపెంట రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 18లోని వాగు పోరంబోకులో ఏర్పాటు చేసిన ప్రభుత్వ హెచ్చరిక బోర్డును మహేంద్ర అనే వ్యక్తి తొలగించడంపై వీఆర్వో దమ్ము మాలకొండయ్య పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. గానుగపెంట రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 18లోని వాగు పోరంబోకు సుమారు రెండెకరాలను కొండాపురానికి చెందిన మెంటా సుధాకర్ ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంపై గానుగపెంట సర్పంచ్ మంచాల మల్లికార్జున రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వీఆర్వో దమ్ము మాలకొండయ్య సర్వేయర్ల ద్వారా సర్వే చేయించి వాగు పోరంబోకుగా గుర్తించారు. శనివారం సర్వే నంబర్ 18లో ప్రభుత్వ భూమిలో ఎవరూ దిగరాదని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయగా మెంటా మహేంద్ర తొలగించాడు. దీంతో తహసీల్దార్ కోటేశ్వరరావు ఆదేశాల మేరకు వీఆర్వో కొండాపురం పోలీస్‌స్టేషన్ లో ఫిర్యాదు చేశారు.

1,2 తేదీల్లో ఆత్మకూరులో జాబ్‌మేళా

ఆత్మకూరు: ఆగస్టు 1,2 తేదీల్లో ఆత్మకూరులోని ఆంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న మెగా జాబ్‌మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కోరారు. సోమవారం సాయంత్రం ఆయన ఆంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో జాబ్‌మేళా ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు జీ సతీష్‌రెడ్డి, మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి జాబ్‌మేళాకు ముఖ్యఅతిథులుగా హాజరవుతారని చెప్పారు. పలు సాఫ్ట్‌వేర్ కంపెనీలు సైతం జాబ్‌మేళాలో పాల్గొంటున్నాయని తెలిపారు. ప్రభుత్వ ఐటీఐ, పాలిటెక్నిక్, ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలల్లో సాంకేతిక విద్యను అభ్యసించి ఖాళీగా ఉన్న యువత జాబ్‌మేళాకు హాజరుకావాలని కోరారు. మంత్రి వెంట ఆత్మకూరు ఆర్డీఓ బీ పావని, మున్సిపల్ చైర్‌పర్సన్ జీ వెంకట రమణమ్మ, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కిమ్స్ డైరెక్టర్ తాళ్లూరి గిరినాయుడు, సోమశిల ప్రాజెక్ట్ చైర్మన్ వేలూరు కేశవచౌదరి, ఎంపీపీ వేణుగోపాల్‌రెడ్డి ఉన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

అనుమసముద్రంపేట ఆత్మకూరులో జరిగే జాబ్‌మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఏఎస్‌పేట తహసీల్దార్ అనిల్‌కుమార్ యాదవ్ కోరారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. దాదాపు 50 కంపెనీలకు చెందిన ప్రతినిధులు జాబ్‌మేళాకు హాజరవుతున్నారని తెలిపారు. నిరుద్యోగులకు సచివాలయ సిబ్బంది జాబ్‌మేళాపై అవగాహన కల్పించి ఇంటర్వ్యూలకు హాజరయ్యేలా చూడాలని కోరారు.

దౌర్జన్యంగా ఆక్రమించారు



ఆక్రమించి చదును చేసిన దృశ్యం

కొండాపురం: తాము ఎన్నో ఏళ్లుగా పశువులు దొడ్డిగా వినియోగించుకుంటున్న స్థలాన్ని కొందరు దౌర్జన్యంగా ఆక్రమించుకున్నారని తూర్పుయర్రబల్లికి చెందిన చిన్నమ్మ సోమవారం విలేకరుల ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. సర్వేనంబర్ 508లోని స్థలాన్ని తాము సుమారు 40 ఏళ్ల నుంచి పశువుల దొడ్డిగా వినియోగించుకుంటున్నామని తెలిపారు. ఏన్నో ఏళ్ల క్రితం గ్రామాన్ని విడిచి వెళ్లిన కందవరపు చిన్నకోటయ్య, కోటేశ్వరరావు ఇప్పుడు వచ్చి టీడీపీ నాయకులతో కలిసి తాము అనుభవిస్తున్న స్థలాన్ని దౌర్జన్యంగా ఆక్రమించుకుని గ్రావెల్ తోలి చదును చేశారని ఆరోపించారు. ఈ విషయమై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని వాపోయారు. ప్రభుత్వ స్థలం హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేస్తానన్న వీఆర్వో శివప్రసాద్ పట్టించుకోలేదని, వారిని ఖాళీ చేయించలేదని ఆరోపించా. ఈ విషయమైన వీఆర్వో శివప్రసాద్‌ను 'సాక్షి' వివరణ కోరగా బోర్డు ఏర్పాటు చేయిస్తామని తెలిపారు

తల్లిదండ్రులకు బాలిక అప్పగింత

ఉదయగిరి: ఇంటి నుంచి అదృశ్యమైన మైనర్ బాలికను గుర్తించి సోమవారం తల్లింద్రులకు అప్పగించినట్లు ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డి తెలిపారు. జీ అయ్యవారిపల్లికి చెందిన మైనర్ బాలిక అదృశ్యంపై తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా నెల్లూరులో బాలికను గుర్తించి అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం బాలిక నుంచి వివరాలు సేకరించి తల్లిదండ్రులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

బసినేనిపల్లి టోల్‌ప్లాజా ప్రారంభం



కారుకు టోల్ వసూలు చేస్తున్న దృశ్యం

సీతారామపురం : మండలంలోని బసినేనిపల్లి వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన టోల్‌ప్లాజాను హైవే అధికారులు సోమవారం ప్రారంభించారు. సీతారామపురం–కావలి 167బీజీ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా బసినేనిపల్లి వద్ద టోల్‌ప్లాజాను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. టోల్‌ప్లాజాను ప్రారంభించడంతో వాహనదారులకు టోల్ బాదుడు షురూ అయింది. ఇకపై ఈ మార్గంలో ప్రయాణించే వాహన చోదకుల నడ్డి విరగనుంది. కారు, జీపు, వ్యాన్ లేదా లైట్ మోటార్ వాహనాలకు 24 గంటల్లో పోను రూ.35, రాను రూ.15, లైట్ కమర్షియల్ వాహనం, గూడ్స్ వాహనం లేదా మినీబస్సుకు పోను రూ. 55, రాను రూ.30, బస్సు లేదా ట్రక్కు (రెండు యాక్సిళ్లు) పోను రూ.120, రాను రూ.60, వాణిజ్య వాహనాలు (మూడు యాక్సిళ్లు) పోను రూ.130, రాను రూ.65, భారీ వాహనాలు (ఏడు అంతకు మించిన యాక్సిళ్లు) పోను రూ.225, రాను రూ.115 చొప్పున టోల్ వసూలు చేస్తున్నారు. టోల్‌ప్లాజా పుణ్యమా అంటూ ఈ మార్గంలో ప్రయాణం భారం కానుంది. సీతారామపురం నుంచి నెల్లూరుకు వెళ్లాలంటే బసినేనిపల్లి, డీసీపల్లి, బుచ్చిరెడ్డిపాళెం టోల్‌ప్లాజాల వద్ద టోల్ చెల్లించాల్సి ఉంటుంది. అలాగే సీతారామపురం–ఉదయగిరి మార్గంలోనూ బస్సు చార్జీలు రూ.10 అదనంగా పెరిగాయి.

పన్ను చెల్లింపుదారుల్లో ఆందోళన

బిట్రగుంట: బోగోలు మేజర్ పంచాయతీలో ఇంటి పన్నులు చెల్లించిన యజమానుల్లో ఆందోళన నెలకొంది. వాట్సప్ గ్రూపులతో పాటు స్థానికంగా కూడా పంచాయతీ అధికారులు నకిలీ రశీదు పుస్తకాల ద్వారా ఇంటి పన్నులు వసూలు చేశారనే ఆరోపణలు వినిపిస్తుండడం, కొంతమంది గృహ యజమానులు తాము చెల్లించిన నగదు, రశీదులకు సంబంధం లేకుండా ఉన్న ఫొటోలను వాట్సప్ గ్రూపుల్లో షేర్ చేస్తుండటంతో పన్ను చెల్లించిన వారిలో ఆందోళన నెలకొంది. అంతేకాకుండా పంచాయతీ కార్యదర్శి ఇంటి పన్నుల వసూళ్లలో అవినీతికి పాల్పడ్డారంటూ వైఎస్సార్‌సీపీ నాయకులు ఆధారాలతో అధికారులకు ఫిర్యాదు చేయడంతో కావలి డీఎల్‌పీఓ బహిరంగ విచారణ చేపట్టిన విషయం తెలిసిందే. కూటమి నేతల ఒత్తిడితో అధికారులు విచారణ ప్రక్రియను ఎటూ తేల్చకుండా కాలయాపన చేస్తుండడంతో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆధారాలతో సహాఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో ఇంటిపన్ను వసూలు చేసి నకిలీ రశీదులు ఇస్తున్నారని, వాట్సప్ గ్రూపుల్లో స్క్రీన్‌షాట్‌లు, ఫొటోలు హల్‌చల్ చేస్తుండడంతో పన్ను చెల్లించిన వారిలో ఆందోళన నెలకొంది.

అధికారుల మీనమేషాలు

బోగోలు పంచాయతీ కార్యదర్శి, పాలకవర్గానికి నడుమ ప్రారంభం నుంచి విబేధాలు నెలకొనడంతో పంచాయతీ ప్రగతి కుంటుపడింది. పంచాయతీలో ప్రైవేట్ వ్యక్తులు, మీడియా పేరుతో కొంతమంది మీడియేటర్లుగా వ్యవహరిస్తూ పంచాయతీని భ్రష్టుపట్టించారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో పాలకవర్గ సభ్యులు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు సమాచార హక్కు చట్టం కింద సేకరించిన సమాచారం, ఇంటి పన్ను రశీదులు, ఫోన్‌పే ద్వారా అదనంగా చెల్లించిన నగదుకు సంబంధించిన ఆధారాలతో సహా అధికారులకు ఫిర్యాదు చేశారు. అయితే అధికారులు విచారణ పేరుతో మీనమేషాలు లెక్కిస్తున్నారే తప్ప పరిష్కారానికి ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శిలఫలకాన్ని ఆవిష్కరించిన మంత్రి ఆనం

చేజర్ల(సోమశిల): చేజర్ల మండలం తూర్పుకంభంపాడులో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సోమవారం పర్యటించారు. రూ.50లక్షలతో నీలకంఠేశ్వరస్వామి దేవస్థానం అభివృద్ధి, రూ.25లక్షలతో జల్‌జీవన్ మిషన్ పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే రూ.22.50లక్షలతో నిర్మించిన పంచాయతీ భవనం, ప్రహరీ, రూ.1.95 కోట్లతో నిర్మించిన సీసీరోడ్లను ప్రారంభించారు. తొలుత కోటితీర్థం త్రికోటేశ్వరస్వామి ఆలయాన్ని మంత్రి ఆనం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.